# ఆరోగ్య హక్కు చట్టం తేవాలి

- ప్రజారోగ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించి, వారి జీవితానికి భరోసా కలిగించేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో 'ఆరోగ్య హక్కు చట్టాన్ని' తీసుకురావాలని, ఈ అంశాన్ని అన్ని రాజకీయ పార్టీలూ తమ మేనిఫెస్టోలో పొందుపరచాలని వైద్యారోగ్యశాఖ మాజీ కార్యదర్శి పివి రమేష్ డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన, పూర్తిస్థాయి వైద్యం ఉచితంగా అందించాలని కోరుతూ ఆదివారం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వక్తలు, విశ్లేషకులు.. వైద్య సేవలు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితి లేకుండా ఆరోగ్యం ప్రజల హక్కుగా ఉండేలా ఆరోగ్య హక్కు చట్టాన్ని తీసుకురావాలని తీర్మానించారు. ఈ సందర్భంగా పివి రమేష్ మాట్లాడుతూ.. మనిషి జీవనశైలిలో, వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అనేక వ్యాధులు విపరీతంగా విస్తరిస్తున్నాయని, వైద్య రంగంలో అనేక మార్పులు వస్తున్నా ఆధునిక వైద్యం పేదవాడికి అందే పరిస్థితి లేదని చెప్పారు.

అలాగే వీరికి అవసరమైన వైద్యం ప్రభుత్వ వైద్యశాలల్లో పూర్తిగా అందటం లేదని, భారీగా పెరుగుతున్న మందులు, వైద్యం ఖర్చులు భరించలేక మరింత పేదరికంలోకి ప్రజలు వెళ్లిపోతున్నారని అన్నారు. ప్రజలందరికీ మెరుగైన వైద్యం పొందే హక్కును కల్పిస్తూ రాష్ట్రాలన్నీ ఆరోగ్య హక్కు చట్టాన్ని తీసుకురావాలని సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ సభ్యులు రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ వైద్యం అందించే రకంగా యూనివర్సల్ హెల్త్ కేర్ పద్ధతిని ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు తెలియజేశామన్నారు. సమావేశంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణయ్య, ప్రధాన కార్యదర్శి టి కామేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి విజయ ప్రకాష్, సిపిఎం, సిపిఐ, సిఐటియు, జై భారత్ నేషనల్ పార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఐఎఎస్ అధికారి పివి.రమేష్

## యువతకు తీవ్ర అన్యాయం

- సిద్ధం సభలతో ప్రజాధనం దుర్వినియోగం
- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక నానా అవస్థలు పడుతున్నారని ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆమె మాట్లాడారు. 2.30 లక్షల ఉద్యోగాలిస్తామని జగన్ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలో రెండు శాతం కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. మెగా డిఎస్‌సి అని చెప్పి, దగా డిఎస్‌సి వేసి ఉద్యోగార్థులను వంచించారన్నారు. ఎపిపిఎస్‌సి ద్వారా ఉద్యోగాలను భర్తీ చేస్తానన్న హామీని కూడా తుంగలో తొక్కారని విమర్శించారు. కేంద్రంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బిజెపి మోసం చేసిందని, అదే కోవలో జగన్ ఉన్నారని, మోసానికి కేరాఫ్ అడ్రస్ బిజెపి అయితే.. ఈ అంశంలో బిజెపికి జగన్ వారసుడని షర్మిల అభివర్ణించారు. బిజెపి హయాంలో దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. యువకుల కోసం కాంగ్రెస్ పార్టీ ఒక నేషనల్ మేనిఫెస్టో ఇచ్చిందని, దీంతోపాటు యువరోషిణి పథకం ద్వారా రూ.5 వేల కోట్లతో ఉద్యోగ, ఉపాధి కోసం ఫండ్ ఏర్పాటు చేస్తుందని ఆమె వెల్లడించారు. జగన్ సిద్ధం సభలు ప్రజా ధనం దుర్వినియోగం చేస్తున్నారని, ఒక్కో సభకు రూ.90 కోట్లు ఖర్చుపెట్టి, ఇప్పటి వరకు దాదాపు రూ.600 కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలకు ప్రశ్నించే హక్కు కూడా లేకుండా చేశారని, ఏదైనా అంశంపై నిలదీస్తే హౌస్ అరెస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు ఒక ఊసరవెల్లి అని, అవసరానికి రంగులు మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. బిజెపితో టిడిపి పొత్తు అనైతికమని ఆమె వ్యాఖ్యానించారు.

## విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించాలి

- రాజకీయ పార్టీలను కోరిన ఎస్‌టియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిఓ 117ను రద్దు చేయడంతోపాటు, కొఠారీ కమిషన్ సిఫార్సుల మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం, కేంద్ర బడ్జెట్‌లో ఆరు శాతం నిధులు విద్యా రంగానికి కేటాయించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) విజ్ఞప్తి చేసింది. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు, తెలుగు మాధ్యమాన్నీ సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేసింది. విజయవాడలోని దాసరి భవన్‌లో ఉపాధ్యాయ వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్ సాయి శ్రీనివాస్, మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు అన్ని రాజకీయ పార్టీలూ తమ వైఖరిని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి సిహెచ్ జోసఫ్ సుధీర్ బాబు, ఉపాధ్యాయ వాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు రైల్వే ప్రాజెక్టులకు శ్రీకారం

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోడీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు స్టేషన్‌లలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ నెల 12న వర్చువల్‌గా ప్రారంభిస్తారని రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గుంటూరు డివిజన్‌లోని మొత్తం రెండు గతి శక్తి టెర్మినల్స్, 21 స్టేషన్లలో ఉత్పత్తి స్టాల్స్, ట్రాలీలు, నాలుగు డబ్లింగ్ ప్రాజెక్టులు, ఒక కోచ్ రెస్టారెంట్‌ను ప్రధాన మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. దాచేపల్లి మండలం పెదగార్లపాడు వద్ద చెట్టినాడు సిమెంట్స్ కోచ్, దాచేపల్లి మండలం తుమ్మలచెరువు, సాయి బాలాజీ వేర్ హౌసింగ్ లాజిస్టిక్స్ ప్రారంభిస్తారని చెప్పారు. స్టేషన్లలో వివిధ రకాల సంప్రదాయ ఉత్పత్తుల తయారీ యూనిట్ల రూపకల్పన, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. గుంటూరు వద్ద ఒక రైలు కోచ్ రెస్టారెంటు, గుంటూరు- గుంతకల్ సెక్షన్ మధ్య 4 డబ్లింగ్ ప్రాజెక్టులు వీటిల్లో ఉన్నాయన్నారు. పది స్టేషన్లలో 13 స్టాల్స్, 8 స్టేషన్లలో 8 ట్రాలీలు సుమారు రూ.64.51 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. దాచేపల్లి వద్ద సిమెంట్ ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా రూ.130 కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. తమ డివిజన్‌లో ఇప్పటి వరకు రెండు కోచ్ రెస్టారెంట్లను నిర్వహిస్తున్నా మన్నారు. 16 కిలో మీటర్ల దూరంలో సాతులూరు- మునుమాక మధ్య డబ్లింగ్, శావల్యాపురం -చీకటిగలపాలెం మధ్య డబ్లింగ్ 17 కిలో మీటర్ల మేరకు పనులు పూర్తి అయ్యాయని వెల్లడించారు.

## వ్యవసాయ నల్లచట్టాలు రద్దు చేయాలి

- రైల్వేల ప్రయివేటీకరణ ఆపాలి
- సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంభిస్తోన్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం చిత్తూరు రైల్వేస్టేషన్ ఎదుట సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంతో రైతులు ఢిల్లీలో మరో పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఆందోళనలో పాల్గొన్న రైతులపై విచక్షణారహితంగా దాడి చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఈ నెల 14న ఢిల్లీలో జరిగే భారీ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సామాన్యులకు అందుబాటులో ఉన్న రైల్వేను ప్రయివేటీకరణ చేసే దిశగా మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి భారీ స్థాయిలో టికెట్ ధరలు చెంచుతున్నారని తెలిపారు. సిపిఎం నాయకులు జ్యోతి, లోకనాథం, ప్రసాద్, సిపిఐ నాయకులు గోపి, చంద్ర, రమాదేవి బాలాజీ పాల్గొన్నారు.

చిత్తూరు రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

## కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి- రణస్థలం (శ్రీకాకుళం జిల్లా)

రాష్ట్రంలో సన్న, చిన్నకారు, కౌలు రైతులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కాలంలో వచ్చిన పంటలకు కనీస మద్దతు ధర అందేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలోని కౌలు రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మొక్కజొన్న తదితర పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. దళారులందరూ కుమ్మక్కై పంట ధరలను తగ్గించి కౌలు రైతులను దగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కౌలు రైతులను గుర్తించేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు పాల్గొన్నారు.

## 250 గ్రానైట్ పరిశ్రమలు మూసివేత

- సమస్యలు పరిష్కరించే వరకూ తెరిచే ప్రసక్తే లేదు : పరిశ్రమల యాజమాన్యం
- వీధినపడ్డ కార్మికులు

ప్రజాశక్తి - మార్కూరు రూరల్

ప్రభుత్వ విధానాలకు నిరసనగా గ్రానైట్ అసోసియేషన్ పిలుపు మేరకు మార్కూరు ప్రాంతానికి చెందిన 250 గ్రానైట్ పరిశ్రమలను ఆయా యాజమాన్యాలు ఆదివారం నుంచి నిరవధికంగా పరిశ్రమను మూసివేశాయి. ఈ సందర్భంగా గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పత్తిపాటి సురేష్, షేక్ కాలేషావలి మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకూ గ్రానైట్ పరిశ్రమలను తెరిచే ప్రసక్తి లేదని తెలిపారు. పరిశ్రమలు మూతపడడంతో వాటి ద్వారా జీవనోపాధి పొందుతున్న వివిధ రాష్ట్రాల కార్మికుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. పరిశ్రమలు మళ్లీ ఎప్పుడు తెరుచుకుంటాయో, అప్పటి వరకూ తమ కుటుంబాలను ఎట్లా పోషించుకోవాలో అర్థం కాక కార్మికులు ఆవేదన చెందుతున్నారు. పరిశ్రమలు మూసివేత ఇంకొద్ది రోజులు ఇలాగే కొనసాగితే మూటముల్లే సర్దుకొని తమ సొంత రాష్ట్రాలకు వెళ్లడం తప్ప వేరే దారి లేదని వారు వాపోతున్నారు.

మూతపడిన గ్రానైట్ కంపెనీలు

# నిధులివ్వని కేంద్రం

**అడుగుముందుకు పడని పెట్రో కెమికల్ కారిడార్ • నోరు మెదపని రాష్ట్ర ప్రభుత్వం**

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర విభజన హామీల్లో భాగమైన కాకినాడ జిల్లాలో హెచ్‌పిసిఎల్, గెయిల్ సంస్థల ద్వారా రూ.32 వేల కోట్లతో 'పెట్రో కెమికల్ కారిడార్' ఏర్పాటుకు బిజెపి ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. దీంతో, ఈ ప్రాజెక్టు ముందుకు కదలలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదు. ఈ ప్రాజెక్టు కోసం గత టిడిపి ప్రభుత్వం కాకినాడ సెజ్ ప్రాంతంలో సుమారు రెండు వేల ఎకరాల భూమిని కేటాయించింది. హెచ్‌పిసిఎల్ - గెయిల్‌తో 2017 జనవరిలో విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందం కుదురింది. రూ.32 వేల కోట్ల ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 50 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పుకొచ్చారు. ఏర్పాటైన తర్వాత రెండు, మూడేళ్లలో పెట్రో కెమికల్ రంగంలో పెట్టుబడులు పుంజుకుంటాయని, ఈస్ట్ కోస్ట్ కారిడార్లో రూ.25 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆశలు కల్పించారు. దీని అనుబంధ పరిశ్రమలతో కలుపుకొంటే మొత్తం రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ఊదరగొట్టారు. ఒప్పందం జరిగి ఆరేళ్లు గడుస్తున్నా ఈ ప్రాజెక్టుకు అతీగతి లేకుండా ఉంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విదల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ఏర్పాటుపై కనీసం నోరు మెదపడం లేదు. దీంతో, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు ఉన్నట్లా? లేనట్లా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పెట్రో కారిడాక్ కోసం కేటాయించిన భూమి

**బిజెపి మొండి వైఖరి**

ప్రత్యేక హోదా విభజన, హామీల అమలును కేంద్ర ప్రభుత్వం అటకెక్కించింది. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ముందుకు కదలలేదు. ఈ ప్రాజెక్టు విషయంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కార్పొరేట్‌తోపాటు ఇతర పన్నుల కింద వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) విషయంపై నేటికీ ఏకాభిప్రాయం కుదరలేదు. విజిఎఫ్ కింద ఏటా రూ.975 కోట్ల చొప్పున 15 ఏళ్లపాటు సమకూర్చాలని 2021లో జరిగిన సమావేశంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కోరినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో స్పందన లేదు. దీంతో, కాకినాడ సెజ్‌లో పెట్రో కాంప్లెక్స్ కలగానే మిగిలిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ ప్రాజెక్టు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

## రాష్ట్రంలో 'జె' ట్యాక్స్ వసూళ్లు

- అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- శంఖారావంలో నారా లోకేష్

ప్రజాశక్తి-రాయదుర్గం, ఉరవకొండ (అనంతపురం)

వైసిపి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండ్ కో రాష్ట్రంలో జె ట్యాక్సులు వసూలు చేస్తూ జనాన్ని అడుగడుగునా ఇబ్బందుల పాలుజేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో ఉరవకొండ, రాయదుర్గం, కల్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రాల్లో ఆదివారం శంఖారావం బహిరంగ సభలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల టిడిపి అభ్యర్థులు పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు అధ్యక్షతన జరిగిన సభల్లో నారా లోకేష్ మాట్లాడారు. సిఎం జగన్ ఒక నియంత అని, తల్లీచెల్లిని ఇంటిని గెంటేసిన వ్యక్తి అని ఆరోపించారు. కల్తీ మద్యం, గంజాయితో ప్రజలను పీడిస్తున్నారని చెప్పారు. సలహాదారుల పేరిట కోట్ల రూపాయల ప్రజల సొమ్మును ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చకు తాను సిద్ధమని అన్నారు. సమయం, తేది సిఎం జగన్ చెప్తే రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పేరిట ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వర్తింపజేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగులకు రూ.3000 నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.15వేలు, రైతులకు రూ.20వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వీటితో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తామన్నారు. సూపర్ సిక్స్ కేలండర్‌ను ప్రతి ఇంటికీ చేర్చే బాధ్యత టిడిపి నాయకులు, కార్యకర్తలదేనని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్‌తో పాటు ఆయా నియోజకవర్గాల టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్ చెప్పేవి అబద్ధాలు : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మేదరమెట్లలోనూ అబద్ధాల విషవు జల్లు చల్లారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆరోపించారు. హామీలు నిలబెట్టుకున్నానన్న జగన్ మాట పచ్చి అబద్ధమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 85 శాతం హామీలు అమలు చేయకుండా మాట తప్పారని అన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయినందునే సభకు లక్షమంది కూడా రాలేదని విమర్శించారు. మద్య నిషేధం అమలు చేశాకే ఓటు అడుగుతానని, 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని, వారంలో సిపిఎస్ రద్దు చేస్తానని, అంగన్‌వాడీ వేతనాల పెంపు వంటి హామీల్లో మాట తప్పి మడమ తిప్పారని ఆరోపించారు. హామీకి భిన్నంగా విద్యుత్ ఛార్జీలు 9 సార్లు పెంచారని, ఉచిత ఇసుక రద్దు చేసి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి పోగొట్టారని విమర్శించారు.

## పట్టాలు తప్పిన ప్యాసింజర్ రైలు

- లోకో పైలెట్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కొత్తవలస (విజయనగరం జిల్లా)

విశాఖపట్నం నుంచి భవానీపట్నం వెళ్లే ప్యాసింజర్ రైలు విజయనగరం జిల్లా కొత్తవలస రైల్వే గేట్ సమీపంలో పట్టాలు తప్పింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి 7.10 గంటల ప్రాంతంలో జరిగింది. లోకో పైలెట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టమూ సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పట్టాలు తప్పిన రైలింజన్

విశాఖపట్నం నుంచి వచ్చిన ప్యాసింజర్ రైలు కొత్తవలస రైల్వేస్టేషన్లో ఆగింది. స్టేషన్ నుంచి బయల్దేరిన రైలు.. వంద అడుగుల దూరం వెళ్లేసరికి.. ట్రాక్ మారుతుండగా ఇంజిన్ పట్టాలు తప్పింది. లోకో పైలెట్ ఎంహెచ్ఆర్ కృష్ణ అప్రమత్తమై రైలును నిలిపేశారు. దీంతో రైలు అక్కడికక్కడే నిలిచిపోయింది. ఈ ఘటనలో ఇంజిన్‌తోపాటు మరో భోగి కూడా పక్కకు ఒరిగింది. ఒక్కసారిగా రైలు కుదుపునకు గురవడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారణాలపై రైల్వే ఉన్నతాధికారులు అంచనాలు వేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్యాసింజర్ రైల్లో ఉన్న ప్రయాణికులు కొత్తవలస జంక్షన్ నుంచి బస్సులో విజయనగరం వెళ్లారు. దూరప్రాంతాలకు వెళ్లే కొంతమంది ప్రయాణికులు తిరిగి కొత్తవలస రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. మూడో లైన్ క్లియర్ చేయడంతో కొత్తవలస నుంచి విజయనగరం వెళ్లే రైళ్లకు ఇబ్బంది తప్పింది. భవానిపట్నం వరకు వెళ్లే ప్రయాణికులను వేరే రైళ్లలో తరలించడానికి రైల్వే సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

## తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద మహిళలు ఆదివారం తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమకు నాలుగు రోజులుగా నీరు రావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి పట్టణం మొత్తం నీరు వస్తున్నా టిడ్కో గృహాలకు మాత్రం ఇవ్వడంలేదని తెలిపారు. నాలుగు రోజులు సక్రమంగా వస్తే మరో నాలుగు రోజులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలుండే టిడ్కో గృహాల వద్ద నీటి సమస్యను అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని వాపోయారు. నీటి సమస్య కారణంగా తమ పిలలను పాఠశాలలకు పంపలేకపోతున్నామని, ఇందుకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ముందస్తు సమాచారమైనా ఇవ్వకుండా నీటిని ఆపేస్తున్నారని మహిళలు మండిపడ్డారు. నీళ్ల కోసం రోజు వారి పనులను కూడా మానుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## 14న వైసిపిలోకి ముద్రగడ

ప్రజాశక్తి - కిర్లంపూడి (కాకినాడ జిల్లా)

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఈ నెల 14న తాడేపల్లిలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరనున్నట్టు తెలిపారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని తన నివాసరంలో ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సిఎం పిలుపు మేరకు వైసిపిలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. భారీగా కార్లు, బస్సులతో ర్యాలీగా తాడేపల్లికి వెళ్లనున్నట్లు ఆయన మీడియాకు వివరించారు. ఏ కారణంతో వైసిపిలో చేరుతున్నారు? పవన్ కల్యాణ్‌పై పోటీ చేస్తారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ పార్టీకి సేవ చేయాలనే ఉద్దేశంతో, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలనే లక్ష్యంతో పార్టీలో చేరుతున్నట్టు చెప్పారు. తనకు గానీ, తన కుమారునికి గానీ ఎటువంటి సీటూ అడగలేదని, ఎటువంటి షరతులు లేకుండానే పార్టీలో చేరుతున్నానని తెలిపారు. వైసిపి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు తన పూర్తి స్థాయి సేవను పార్టీకి అందిస్తానని, వైసిపి పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తానని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి గెలిచిన తర్వాత ఏ పదవి ఇచ్చినా స్వీకరిస్తానని, తాను మాత్రం ఏ పదవీ అడగనని చెప్పారు.

సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

## సిద్ధం సభలో ప్రయాణికుల పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన వైసిపి సిద్ధం సభకు ప్రజలను తొడ్కొని వెళ్లేందుకు 70 శాతం ఆర్‌టిసి బస్సులను ఆ పార్టీ నేతలు తీసుకోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం వెయ్యి బస్సులు ఉండగా 700 బస్సులు మేదరమెట్లకు పంపారు. ఆయా గ్రామాలు, పట్టణాల నుంచి వైసిపి నేతలు, ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు వీటిని అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు బస్సులు లేక ప్రజలు ప్రత్యామ్నాయంగా ప్రయివేటు వాహనాలను ఆశ్రయించారు. గుంటూరు, మంగళగిరి, తెనాలి, నర్సరావుపేట, పిడుగురాళ్ల, మాచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట, బాపట్ల, రేపల్లె తదితర డిపోల నుంచి మేదరమెట్ల సభకు 700 బస్సులను కేటాయించారు. .సిద్ధం సభ సమాచారం తెలియక చాలా మంది ప్రయాణికులు బస్‌స్టాండ్లకు వచ్చి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి వేచి ఉండగా ఒక్కోమార్గంలో ఒకటి రెండు బస్సులు రావడం వల్ల తీవ్రమైన రద్దీతో ప్రయాణించాల్సి వచ్చింది. ట్రాఫిక్ మళ్లింపులతో ఒంగోలు, నెల్లూరు